క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజంపేట రూరల్ : శ్రీగోదా మహాలక్ష్మి సమేత ఐరావత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ శివార్లలోని మన్నూరు వద్ద మునక్కాయలపల్లి రహదారిలో ఉన్న శ్రీగోదా మహాలక్ష్మి సమేత ఐరావత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం నిర్వహించిన పూజలలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. అదే విధంగా ప్రతి శనివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. 9441866533 నెంబర్‌ను సంప్రదించి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

సాయినాథునికి పూజలు

పుల్లంపేట : పుల్లంపేటలో కొలవైన శ్రీ సద్గురు సాయినాథునికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే సాయినాథుడు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం పలువురు భక్తులు ఆలపించిన సాయినాథుని గీతాలు అలరించాయి.

బాధ్యతల స్వీకరణ


మురాద్ షావలీ

సిద్దవటం : సిద్దవటం తహసీల్దారుగా మురాద్ షావలీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తహసీల్దార్ల బదిలీలు జరిగిన విషయం విదితమే. సిద్దవటంలో తహసీల్దారుగా పనిచేస్తున్న లక్ష్మిదేవి తిరుపతికి బదిలీ అయ్యారు. సత్యసాయి జిల్లాలోని మడకశిరలో తహసీల్దారుగా పనిచేస్తున్న మురాద్ షావలీ సిద్దవటంకు బదిలీపై వచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలండర్‌లను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, యానాదయ్యలు

రాజంపేట రూరల్ : డివిజన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్‌లను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్దవటం యానాదయ్యతో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం విచ్చేసి ఆకేపాటికి సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొందలూరు రవిశంకర్, నియోజకవర్గ అధ్యక్షులు జె.రామకృష్ణ, కార్యదర్శి కె.వెంకటేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

3న చలో ఢిల్లీ


గోడపత్రాలను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

రాయచోటి అర్బన్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో చలో ఢిల్లీ పోస్టర్లను పీడీఎస్‌యూ నేతలతో కలసి అంకన్న ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానంతో రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 3న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహింప తలపెట్టిన మహాధర్నాకు విద్యార్థులు హాజరుకావాలంటూ కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు వాసుదేవ నాయక్, స్వరూప్ తేజ, కుమార్ నాయక్, నవీన్, మణికంఠ, రాంప్రసాద్, మహేష్, కార్తిక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో శ్రమదానం


బెస్తపల్లెలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దత్తత గ్రామం బెస్తపల్లెలో 7 రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని గురువారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన మనస్సు, సంపూర్ణ ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత దోహదం చేస్తాయన్నారు. తమ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వరుసగా వారం రోజులపాటు బెస్తపల్లెలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నాగనవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీయూపీ హెచ్ఎం రెడ్డినాయక్, సర్పంచ్ లోకనాథరెడ్డి, గ్రామ పెద్దలు శేఖర్, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం గ్రామ సచివాలయం

- సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పాయి
- ప్రభుత్వ నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


లక్కిరెడ్డిపల్లె: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


గాలివీడు: సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాయచోటి ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లె : గ్రామ స్వరాజ్యానికి ప్రతి రూపంగా జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు నిలిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లె-1 సచివాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను, లక్కిరెడ్డిపల్లె-2 సచివాలయ పరిధిలో గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వ్యయ, ప్రయాసలు లేకుండా చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను ఒడజేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలకు కోట్లాది రూపాయలతో శాశ్వత కార్యాలయ భవనాలను నిర్మించి పల్లెల మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు.

విజ్ఞాన కేంద్రాలుగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు

రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రైతు సంక్షేమానికి కృషి చేసి రైతు పక్షపాతిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తండ్రి బాటలో నడుస్తూ రైతుల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు. ప్రతి పంటనూ రైతులు ఈ-క్రాపింగ్ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో వైద్యాన్ని తీసుకొచ్చామన్నారు. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సచివాలయం కాంట్రాక్టర్లు సయ్యద్ అమీర్, రాజారెడ్డి, రవి ఆచారి, వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 9గంటల పాటు నాణ్యమైన విద్యుత్

రాయచోటి/గాలివీడు : రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే జగన్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చీమలచెరువపల్లె, అరవీడు, రాయచోటి మండలంలోని యండపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు వేర్వేరుగా జరిగిన భూమి పూజలలో ఎమ్మెల్యే గడికోట ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇటీవలే గాలివీడు సమీపంలో రూ.28.44 కోట్లతో 31.5 ఎంవీఏ సామర్థ్యం గల 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తూముకుంట వద్ద 100 మెగా వాట్ పోలార్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పాత్తుకూరుపల్లె, నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. పెద్దమండెం మండలం బండివాండ్లపల్లి దగ్గర హంద్రీనీవా లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నిర్మించిన 132/33కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి గాలివీడుకు కొత్త 33కేవీ లైన్‌ను 10.5 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయించి గాలివీడులో లో ఓల్టేజీ సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ యదుభూషన్‌రెడ్డి, స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ పోలుసుబ్బారెడ్డి, పల్లపు రమేష్, ఏపీఎస్‌పీడీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వేదమూర్తిరెడ్డి, ఆవుల నాగభూషన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, ఏఈ నరేంద్రరెడ్డి, ఖాదర్‌మోద్దిన్, ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, అమరనాథరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు నిజాం వలి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా భైరవుడి క్షేత్రం


రాయచోటి టౌన్: సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : శ్రీ వీరభద్రస్వామి వారి వాహనమైన భైరవుడి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని ఆర్‌కేటీ రోడ్డు నుంచి శ్రీ భైరవ స్వామి ఆలయం వరకు గడప గడపకూ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ కార్యదర్శి బుడ్డా ధర్మారెడ్డి, రాయచోటి వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ ఆనందరెడ్డి, సర్పంచ్‌లు శంకరయ్య, దివాన్, నాగేశ్వరావు, తిరుపాల్ నాయుడు, ఎంపీటీసీలు రామ్మోహన్ నాయుడు, విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాధవరం రమేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి,మాజీ కౌన్సిలర్ ఖాదర్ వలి, శ్రీనివాసుల రెడ్డి, హరినాథరెడ్డి, యర్ర బయన్న, నల్ల బయన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం భైరవుడి ఆలయ సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి భూమిపూజ చేశారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

రాయచోటి అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు గురువారం వేర్వేరుగా విడుదల చేసిన ఒక ప్రకటలలో అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే అంశంలో కాని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడం , కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, రాజధాని అమరావతికి నిధుల మంజూరు, విభజన హామీలు తదితర అంశాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్రం నుంచి జీఎస్టీ వసూళ్లు పెరిగినా రాష్ట్రం వాటా మాత్రం పెరగడం లేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాలపై అధికార, ప్రతిపక్షాలు వ్యతిరేకించి పోరాడాలంటూ వారు పిలుపునిచ్చారు.

30 లీటర్ల నాటు సారా స్వాధీనం

సంబేపల్లె : 30 లీటర్ల నాటు సారాతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారి వివరాల మేరకు మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ అన్నప్పగారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి నాటుసారా అక్రమంగా తరలిస్తున్నారని ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి గ్రామ సమీపంలో నాటుసారాను తరలిస్తున్న వ్యక్తితోపాటు 30 లీటర్లు నాటు సారాను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

ఎంపీడీఓ పదవీ విరమణ

సంబేపల్లె : సంబేపల్లె ఎంపీడీఓ పదవీ విరమణ పొందారు. గురువారం ఆయనకు మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీడీఓ సేవలను కొనియాడారు. సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి అందించడంలో ఎంతో నేర్పు చూపారన్నారు. అనంతరం ఎంపీడీఓను ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమెమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి, వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'జ్యోతీశ్వర్ మరణం తీరనిలోటు'


నివాళ అర్పిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట : వైఎస్సార్‌సీపీ బీసీ సీనియర్ నేత నల్లబోతుల జ్యోతీశ్వరబాబు మృతి తీరనిలోటని జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. గురువారం బోయపాళెం(పాతబస్టాండు)లోని జ్యోతీశ్వరబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతీశ్వరబాబు బీసీల్లో మంచి పట్టు ఉన్న నేతన్నారు. పార్టీలో చేరినప్పటి నుంచి అన్ని ఎన్నికల్లో చురుగ్గా పనిచేసేవారన్నారు. ఆయన సేవలను మరువలేమన్నారు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డి, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి మురళీరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి మురళీ రెడ్డి, శ్రీనివాసులయాదవ్‌లు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా మధుసూదనరెడ్డి జ్యోతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈయన వెంట పట్టణ జేసీఎస్ కన్వీనరు వడ్డె రమణ, ఆర్‌డీసీ డైరక్టరు గుల్జార్‌బాషా, ప్రాంతీయ వైద్యశాల డైరక్టరు ఉమామహేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

మానవళి మనుగడకు మొక్కలే జీవనాధారం


మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి

గాలివీడు : మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పెద్దూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో అవసరమైన పూల, ఔషద మొక్కలను సొంత నిధులతో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్(ఎస్‌కే)ను అభినందించారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షించే బాధ్యతను ఆలయ కమిటీ సభ్యులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ – 2 శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నరసారెడ్డి, నాగభూషణం నాయుడు, అమీన్, బీసీ నాయకులు మల్లికార్జున, సమీర్, యువజన నాయకులు రమణారెడ్డి, శేఖర్, గంగాధర్, శివారెడ్డి, వెంకటస్వామి, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం


కుళాయిలను ప్రారంభిస్తున్న పోలు సుబ్బారెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం మల్లెంవాండ్లపల్లె దాహర్తి తీరింది. ఎన్నో ఏళ్లగా ఆ పల్లె వాసులకు తాగునీటి సమస్య వేధిస్తోంది. ఈ విషయం రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి దృష్టికి రావడంతో ఆయన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి నిధులు కేటాయించడంతో బోర్లు వేసి ఇంటింటికి కుళాయిలు బిగించారు. ఈ కుళాయిలను పోలు సుబ్బారెడ్డి గురువారం ప్రారంభించి తాగునీరు ఇంటింటికి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి, పోలు సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దివాన్, బీసీ నాయకులు పల్లపు రమేష్, వైఎస్సార్‌సీపీ కనపర్తి హరినాథరెడ్డి, మహేష్ నాయుడు, హరిప్రసాద్ నాయుడు, మనోహర్ నాయుడు, హేమంత్ నాయుడు, ఆనంద నాయుడు, రెడ్డెప్ప, మల్లప్ప, బి.రెడ్డెప్ప, పెద్ద రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లను తనిఖీ చేసిన కమిషనర్


హోటల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని పలు హోటళ్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హోటళ్ల పరిసరాలు, వంటగదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ యాజమాన్యానికి సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగించుకోరాదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, హెల్త్ అసిస్టెంట్ తిరుమలదాస్‌లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కార్మిక పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డిని కలిసి పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యల కారణంగా ఉద్యోగులు సతమతమవుతున్నారని తెలియజేశారు. యూనియన్లకు అతీతంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు జిల్లా ప్రజా రవాణాధికారి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, కడప డిపో కమిటీ సభ్యులు మురళీమోహన్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు


పెనగలూరులో అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

సంబేపల్లె : కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని, వారి గౌరవానికి భంగం కలగకుండా మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని వైద్యులు తెలిపారు.

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కుష్టువ్యాధి ఎవరికైనా రావచ్చని, దీనికి వయస్సు, లింగభేదం ఉండదన్నారు. కుష్టు వ్యాధి మచ్చలు చర్మంపై ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయని, మచ్చపై స్పర్శ, నొప్పి ఉండదన్నారు. కుష్టు వ్యాధి నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం అయ్యేందుకు సగటున 3 నుంచి 5 సంవత్సరాలు పడుతుందన్నారు. అనంతరం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ వరలక్ష్మి మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగించేందుకు జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కుష్టు వ్యాధి బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో పూర్తిగా నయమవుతుందన్నారు. తక్కువ తీవ్రత కలిగిన వ్యాధిగ్రస్తునికి 6 నెలలు, తీవ్రత కలిగిన వ్యక్తులకు 12 నెలల పాటు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు టి.లక్ష్మిదేవి, కె.లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు కుష్టువ్యాధి, కౌమార విద్యపై గురువారం వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రారంభ దశలో కనుగొన్నట్లైతే వ్యాధి నయం చేసేందుకు వీలుంటుందన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు. ముందస్తు అవగాహన కలిగి ఉన్నట్లైతే ఎలాంటి వ్యాధినైనా సులభంగా అరికట్టవచ్చని వారు తెలిపారు. కౌమార దశలో విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మ క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.చెన్నమ్మ, జమున, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీవాణి, పద్మజ, అన్వర్ బాషా, సుదర్శన్, మహేంద్ర, శివ, నరసింహులు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా ఉపాధ్యక్షురాలిగా కల్పన



లక్కిరెడ్డిపల్లె : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కల్పనకు గురువారం స్థానిక సచివాలయం – 2 ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ, మాజీ ఎంపీపీ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని కల్పన తెలియజేశారు.

నేడు ప్రభుత్వవిప్ పర్యటన

ఓబులవారిపల్లె : నేడు శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మండలంలో పర్యటించనున్నట్లు ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు.

రేపు భక్తి నృత్యోత్సవం


కడప కల్చరల్ : కడపలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో శనివారం సాయంత్రం 'ఆయన' పేరిట ఆధ్యాత్మిక నృత్యోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. పేరుగాంచిన ప్రముఖ నృత్యకారుల ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని, ప్రజలు తప్పక తిలకించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు క్రమశిక్షణ అలవరుచుకోవాలి


క్రీడా మైదానంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నందలూరు(రాజంపేట) : నందలూరు ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో గురువారం అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మానవ జీవన విధానంలో చెట్లు ఒక భాగమని, అన్ని విధాల తోడ్పాటు అందిస్తాయని, ప్రకృతి సమతుల్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ నీలవేణి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు నిబద్ధత, సహకార గుణం, శ్రమ విలువతోపాటు సామాజిక బాధ్యత, విలువలు, జాతీయ భావన లాంటి ఉన్నతమైన అలవాట్లు అలవడతాయన్నారు. అనంతరం క్రీడా మైదానం చుట్టూ మొక్కలు నాటారు. స్పెషల్ క్యాంపులో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ర్యాలీ


బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : రాజంపేటలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల బైకుర్యాలీని ఎంవీఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో 70 మంది హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. కారక్రమంలో డీఎం రమణయ్య, ఆర్టీసీ, ఎంవీఐ కార్యాలయాల సిబ్బంది, హీరో హోండా, టీవీఎస్, యమహ షోరూం సిబ్బంది, డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెలో అనుమతులులేని ఆస్పత్రులు

మదనపల్లె : పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఆరంతస్థుల భవనాలు, లోపల అంతా హైఫై... డాక్టర్లు, నర్సుల హడావిడి. ఆస్పత్రిలోకి వెళ్లడమే తరువాయి. రోగంతో సంబంధం లేకున్నా, అనవసర పరీక్షల పేరుతో పేషెంట్ జేబుకు చిల్లు. చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలంటూ... జ్వరానికి సైతం వేలల్లో బిల్లులు. మనం వెళ్లింది పట్టణంలోనే పేరుమోసిన ఆస్పత్రికి అనుకుని సర్దుకుపోతుంటే... చివరకు తెలిసిందేమంటే.. పట్టణంలోని సగానికి పైగా ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేవని..!

గురువారం అన్నమయ్యజిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి వచ్చిన డెమో దేవశిరోమణి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులపై నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో అసలు గుట్టు రట్టయింది. దీంతో అవాక్కయిన ఆమె ఆయా ఆస్పత్రులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలుచేస్తూ, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, రెసిడెన్షియల్ ఏరియాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బందులు పెడుతున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓకు ఇచ్చిన ఫిర్యాదు అధికారుల్లో కదలిక తెచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మదనపల్లెకు వచ్చిన డెమో దేవశిరోమణి పట్టణంలోని ప్రవీణ్ న్యూరో, రెయిన్‌బో హాస్పిటల్, మోడరన్ హాస్పిటల్‌లను తనిఖీ చేశారు. జనరల్ ఫిజీషియన్ ఆస్పత్రి పేరుతో అనుమతులు తీసుకుని గుండెజబ్బులకు చికిత్సలు చేస్తుండటం, స్టంట్, ఇంజక్షన్‌లకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకోవడం, క్యాథ్‌ల్యాబ్‌కు అనుమతి లేకుండానే నిర్వహిస్తుండటాన్ని గుర్తించారు. పేషెంట్లకు వైద్యఖర్చులకు సంబంధించిన బిల్లుగా కాకుండా స్లిప్‌లో ఎస్టిమేట్ రూపంలో వేసి ల్యాబ్‌లో కట్టించుకోవడాన్ని గమనించారు. రెయిన్‌బో, ప్రవీణ్ న్యూరో ఆస్పత్రులు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు, రిజిస్ట్రేషన్ చేయకుండానే నిర్వహిస్తున్నట్లు తేల్చారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు కాకపోయినప్పటికీ, వేరే ఆస్పత్రి ఆథరైజేషన్‌తో సర్జరీలు చేయడమే కాకుండా, ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే అదనపు వసూళ్లు, ఫీజులకు సంబంధించి ధరలపట్టిక బోర్డు లేకపోవడాన్ని గమనించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నివేదికలు పంపుతామన్నారు. దీనిపై బహుజన యువసేన పునీత్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను మూసివేయించాలని, లేకుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.